## Clip No: 01

ప్రేమస్వరూపులారా!

యుగయుగముల నుండి, తరతరములనుండి ఉగాది యొక్క ఆనందమును అనుభవిస్తూ వస్తున్నారు. భారతీయులు అన్ని దేశములకు కూడను ఆధ్యాత్మిక తత్వ ప్రభావము చేత శాంతి భద్రతలు చేకూరుస్తూ వచ్చింది. కనుకనే, నాటి మొదలు నేటి వరకు **"లోకాః సమస్తా సుఖినో భవంతు**" అన్నటువంటి సూక్తి భారతీయులు అన్ని దేశముల కూడను సుస్థిరమైనటువంటి శాంతి భద్రతలను చేకూరుస్తూ వచ్చింది.

కానీ, ఈనాటి మానవుడు భౌతికంగా, లౌకికంగా ఎంతో ప్రగతిని పొందినారు. కానీ, నైతికంగా మానవుడు క్షుద్ర విమర్శలను, సంకుచితమైన భావములను అరికట్టుకొనలేకపోతున్నాడు.

దీనికి కారణమేమని ఎవరికి వారు తమ హృదయ పరిశీలిన జరిపినప్పుడు గాఢముగా కూడుకున్నటువంటి యొక్క తన హృదయము నుంచి స్వార్థ స్వప్రయోజనములే దీనికి మూలకారణములని గుర్తించటానికి వీలవుతుంది.

ఈనాటి మానవుడు వస్తువుల నిమిత్తమై వస్తువులను ప్రేమించటం లేదు. వ్యక్తుల నిమిత్తమై వ్యక్తులను ప్రేమించటం లేదు. దేశ క్షేమ నిమిత్తమై దేశమును ఆరాధించటం లేదు.

ఏది చూచినా, ఏది చెప్పినా, ఏది తలంచినా అంతయు కూడను తన స్వార్థము కోసమనే ఉపయోగిస్తున్నాడు. ఈ సంకుచితమైన భావములను ఏనాడు మానవుడు దూరము గావించునో, ఆనాడే ఉగాది యొక్క ఫలితము మనము అనుభవించినవారమవుతాం.

ఈనాడు తెల్లవారు లేవగానే అభ్యంగ స్నానములు ఆచరించి, నూతన  వస్త్రములు ధరించి, ఇంటియందు కొన్ని తీపి వస్తువులు అనుభవిస్తూ వస్తున్నారు.

కానీ, బయట శుభ్రము, బయట నూతన వస్త్రములు ధరించటం మాత్రమే సులభం కాని, తన అంతర్ముఖములందు, అంతర్భావములయందు అతి అమూల్యమైనటువంటి హృదయాన్ని చెడుపుకుంటూ దుర్భావముల చేత, దుర్గుణముల చేత, దురాలోచన చేత హృదయాన్ని మాలిన్యము గావించుకుంటున్నారు.

తన హృదయాన్ని ఏనాడు మానవుడు పరిశుద్ధముగావించునో, పవిత్రముగావించుకొనునో, స్వార్ధరహితమైనటువంటి యొక్క భావమును అభివృద్ధిపరచుకొనునో ఆనాడే మానవుడు ఉగాదిని అనుభవించినటువంటివాడు, ఉత్తముడుగా రూపొందుతాడు.

## Clip No: 02

ప్రేమస్వరూపులార!

ఈనాడు ఉగాది. యుగములకు ప్రతి దినమైనటువంటిది కాబట్టే **"యుగ ఆది"** అన్నారు. ఈ యుగాది అనేటువంటిది ఏనాటి నుండో జరుగుతూ వస్తున్నాది. కానీ ఎన్ని ఉగాదులు జరిగినప్పటికిని, మన హృదయములోనున్న దుర్భావములు ఏమాత్రము కూడను కదిలిపోవటము లేదు. ఏనాడు మానవుని హృదయము పరిశుద్ధము గావించుకొని, పవిత్రమైన భావములు పెంచుకొని, ప్రేమతత్త్వమును నింపుకొని, త్యాగ భావమును పంచినప్పుడే నిజమైన ఉగాది. మీరు తీసేటువంటిది, తిరిగేటువంటిది, ధరించేటువంటిది కాదు ఉగాది యొక్క లక్ష్యాలు.

ఈనాడు కొత్త షర్టు వేసుకోవచ్చు. కానీ ఎంత కాలమది కొత్తది. రేపటికది పాతదే. అదే రీతిగనే, ఈనాడు ఒక newspaper మనం చదువుతున్నాము, కానీ చదివిన పేపరే ఎవ్వరు కూడా చదువరు కదా! ఈనాడు చదివిన పేపర్ రేపు waste పేపర్ అయిపోతుంది. కాని అలాంటి newspaper ని ఎప్పటికి చదువటానికి వీలుకాదు.

ఒక్కతూరి మనకీ జన్మము లభించింది. ఈ జన్మము మనము అనుభవించాము. చాలిక. వచ్చే జన్మమే మనకు అక్కరలేదు. ఇంకొక newspaper మనము తీసుకోనక్కరలేదు. ఈ newspaperతో పని అయిపోయింది, దీనిని మనము చదివినాము, దీనిని అనుభవించాము, ఆనందించాము, దుఃఖపడ్డాము, విచార పడ్డాము. అన్నింటిని మనం అనుభవించాము. ఓ! భగవంతుడా ఈ newspaper నీవీనాడు ఇచ్చావు. దీనివల్ల అనుభవించవలసినవన్నీ అనుభవించాము. ఇక రెండవ newspaper నాకు అక్కరలేదు. రెండవ జన్మ నాక్కకరలేదు. **"పునర్ జన్మ న విద్యతే"**

## Clip No: 03

ఈ జగత్తులో ఎన్నో జరుగుతున్నాయి, ఎన్నో చేస్తున్నాము, ఎన్నో అనుభవిస్తున్నాము. కానీ ఏమాత్రము ఆనందము చేకూరటం లేదు. కనుకనే ఆనందమనేటువంటిది మనకు లభ్యం కావాలంటే, ఈ ప్రకృతి వస్తు, వాహనాదుల వల్ల కాదు, ప్రకృతి యొక్క కార్య కర్మాదుల వల్ల కాదు. గ్రంథ పటనముల వల్ల కాదు, పెద్దల దర్శన, స్పర్శన, సంభాషణ వల్ల కాదు.

నీ హృదయాన్ని పవిత్రము గావించుకొన్న దినమే నీకు భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. నీవందరినీ ప్రేమించు, అందరిని విశ్వసించు, అందరినీ ఆనందపరచు. అప్పుడే నీకు

ఆనందము లభ్యమౌతుంది. ఇతరులకు ఆనంద పెట్టకుండా నీవు మాత్రం ఆనంద పడాలంటే అది సాధ్యమౌతుందా? కాదు కాదు కాదు.

కనుకనే మనము ఈ ఉగాది దినము చేయవలసిన పని ఏమిటి? ఈనాటి నుండి మన హృదయాల్ని పవిత్ర గావించుకొనే పద్ధతిలో మనం ప్రయత్నము చేయాలి. జరిగిపోయినవి- జరిగి పోయినవి, తిరిగి రావవి.

నడుచుకొని వచ్చిన రోడ్డు చూచుకొనే వచ్చావు, ముందు రోడ్డు చూడాలి కానీ వెనుక రోడ్డు ఎందుకు? Future is not sure. అది మనకు సత్యమైనటువంటిది కాదు. క్షణములో గడిచిపోతుండాది. రేపటివరకు ఉంటామనే నమ్మకమెక్కడ? కనుక నీవు future గురించి చింతించవద్దు, నువ్వు తలంచవద్దు. Present ని నీవు చింతించుకుంటూరా. Present ప్రధానమైనటువంటిది. This is not ordinary present, this is Omni-present. కనుక నీవు present ని పవిత్రం గావించుకుంటూ పోయినప్పుడే, నీ past కూడను పవిత్రమౌతుంది, future కూడా పవిత్రమౌతుంది.

ప్రేమస్వరూపులార!

ఈనాడు ఆంధ్రుల నూతన సంవత్సరమని, రేపటి దినము తమిళ వారి న్యూ ఇయర్ అని, మర్నాడు కేరళ వాళ్ళ విషు అని, దినదినము, దినదినము ఒక్కొక్క పండుగలు వస్తున్నాయి. పండుగలకు ఏమి తక్కువలేవు. కావలసినన్ని పండుగలు ఉంటున్నాయి. కానీ పండుగలు అనుభవించే బుద్ధి మనలో ప్రారంభం కావాలి.

ప్రేమస్వరూపులార! నేటి నుండి, ఈ క్షణము నుండి మీలో ఉన్నటువంటి దుర్భావములను, దుర్గుణములను, దురాచారములను దూరము చేసి, హృదయాన్ని పవిత్రము గావించుకోండి.

అప్పుడే మీకు ఆనందం ప్రాప్తిస్తుంది. కేవలం ఎన్ని గ్రంధములను చదివినా ప్రయోజనము లేదు. ఎంతమంది పెద్దలను దర్శించినప్పటికిని ప్రయోజనము లేదు, నీ హృదయాన్ని మొట్టమొదట పవిత్రము చేసుకో, నీవు పవిత్రముగా ఉంటుండు. నీ పనులను పవిత్రముగా చేయి. అప్పుడే నీకు సార్ధకమౌతుంది. అదియే ఉగాది యొక్క ప్రధానమైన సంస్కృతి.

## Clip No: 04

చూడండి ఉగాది దినము. పవిత్రమైన భావములకు, పవిత్రమైన ఫలితములే వస్తుంటాయి. కనుక మనము చేసే ప్రతి పని కూడను పవిత్రమైన హృదయముతో చేస్తే తక్షణమే పవిత్రమైన ఫలితము వస్తుంది.

దీనికి ఎవ్వరిని మనం సాక్షముగా తీసుకోనక్కరలేదు. నేనే సాక్షము. నేను చేసేటువంటి ప్రతి పని కూడను నిస్వార్ధముగా చేస్తాను. స్వార్ధమనేటువంటిది ఏ పక్కనా లేదు. అన్ని పరోపకార నిమ్మిత్తమై చేసేటువంటివే.

ఈ సత్యాన్ని చాలా మంది గుర్తించుకోడానికి ప్రయత్నించడం లేదు. ఏదో ఫలితం కోసం చేస్తున్నారనుకుంటారు. నాకొచ్చే ఫలితమేమి లేదు. నాకొచ్చే ఫలితమొక్కటే, అందరు ఆనందించినప్పుడు నేను ఆనందిస్తాను.

కనుక మీరు కూడను సాయి భక్తులైనందుకు ఈ విధమైనటువంటి సాయి మార్గాన్ని తప్పక తు. చ అనుభవించుకుంటూ రాండి, ఆచరించుకుంటూ రాండి. మీరు కూడను నా మాట మీద నడచినప్పుడు మీరు కూడను ఈ విధమైనటువంటి పవిత్రమైనటువంటి ఫలితాన్ని పొందుతూ వస్తారు. పవిత్రమైనటువంటి యొక్క సార్ధక నామాన్ని అందుకుంటారు.

క్షణాల వరకు కూడా మీరు కాచుకోనక్కర్లేదు. నేను ఒక్కతూరి చెప్తే తప్పక అది కూడను ఫలించుకుంటూ వస్తుంది. కనుకనే సాయి భక్తులైనటువంటి వారు స్వార్థాన్ని కొంతవరకు త్యజించి, పరార్థాన్ని వరించి, ప్రేమతత్వంలో జీవితాన్ని గడపండి, పరదూషణ మానండి. పరహింసను మానండి.

నీకు ద్వేషియైనటువంటి వారిని చూచిన తక్షణమే నమస్కారం చెప్పండి. మనలో ఎంత ద్వేషం వుంటాదో అంత మనం కృంగిపోతాము. ద్వేషము చాలా చెడ్డది. ఈ ద్వేషానికి మనము ఏమాత్రము కూడను గురికాకూడదు. ప్రేమను పెంచుకోండి. ప్రతి వ్యక్తిని కూడను ప్రేమించండి.

బీదలు ఉంటుంటారు, అలాంటి వాళ్లకు మనం చేతనైనంత, కించిత్తైనా సాయం చేయండి. అదే **help ever hurt never** ***"పరోపకార పుణ్యాయ పాపాయ పరపీడనం"*** అని వ్యాసుల వారు ఈ యొక్క భగవద్గీత లోపల చెప్తూ వచ్చారు. ఏంటిదిది? భారతీయ సంస్కృతీయందు ఇది ప్రధానమైనటువంటి ఘట్టం. ***"పరోపకార పుణ్యాయ పాపాయ పరపీడనం".***

నీవు ఎవరినో పీడిస్తున్నావని అనుకోవద్దు. నీవు పరులను పీడించినట్టైతే నిన్ను నీవు పీడించుకోటమే. పరులకు మనం ఎంత సాయం చేస్తామో, అంతకు పదింతలు మనకు సహాయము అందుతుంది. పరులకు మనము ఎంత కీడు చేస్తామో, అంతకు పదింతలు కీడు నీకు కలుగుతుంది. ఈ విషయాన్ని మనం దృష్టిలో వుంచుకోవాలి.

కనుక నేటి నుంచి అందరూ ప్రేమస్వరూపులైపోయి, ప్రేమమయులైపోయి, ప్రేమహృదయులైపోయి ఈ ప్రేమ చేతనే పవిత్రమైన కార్యములు ప్రారంభించండి.

**భజన్: ప్రేమ ముదిత మనసే కహో...**